మంత్రుల పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

కొల్చారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొల్చారం, జూన్ 18 : పలు అభివృద్ధి పనుల ప్రారంభంలో భాగంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం కొల్చారం మండలాన్ని సందర్శించనున్నారని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కొల్చారంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ గఫర్ మియా, ఎంపీడీవో లక్ష్మీ నర్సింహులు, ఎంఈవో నీలకంఠం, ఏపీవో మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 18 : సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోసం ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణ తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నారు. డిగ్రీ అర్హత కలిగిన మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ,యువకులకు బీసీ స్టడీ సర్కిల్ వెబ్ సైట్ www.tg bcst udycircle. cgg. gov.in ద్వారా ఈనెల 19వ తేదీ నుంచి జూలై 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించరాదన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో వంద మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి జూలై 7న అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు జూలై 18వ తేదీ నుంచి 18 ఏప్రిల్ 2025 వరకు హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. అభ్యర్థుకు ప్రతి నెల వసతి, రవాణా భత్యం కింద రూ. 5 వేలు, పుస్తకాల కోసం ఒక సారి రూ. 5 వేలు ఇవ్వనున్నారు. మరిన్ని వివరాలకు సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో గానీ 084 55-277015, 9949592991 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చెక్‌డ్యామ్‌ల్లో పూడిక తీయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ యాదగిరి

రేగోడ్, జూన్ 18 : మట్టితో నిండిన చెక్ డ్యామ్‌ల్లో పూడిక తీయాలని జడ్పీటీసీ యాదగిరి సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఇరిగేషన్ ఏఈ దేవేందర్ దృష్టికి తీసుకెళ్లారు. పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సింధోల్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్‌రెడ్డిని కోరారు. ఆయన మాట్లాడుతూ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి రైతులు మండలంలో 301 మంది రైతులు ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాధికారి జావిద్ తెలిపారు. అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవి కాలం ముగియనుండడంతో కార్యవర్గానికి ఘనంగా సన్మానించారు.ఎంపీపీ సరోజన సాయిలు, వైస్ ఎంపీపీ వినీలావీరప్ప, కో-ఆప్షన్ చోటుమియా, ఎంపీటీసీలు నర్సింహులు, నాగిరెడ్డి, పశువైద్యశాఖ ధర్మచందర్, ఐసీడీఎస్ సిబ్బం ది కృష్ణవేణి, ఏపీవో జగన్మోహన్‌సింగ్, విద్యుత్ సిబ్బంది నాగరాజు, వైద్య శాఖ సీహెచ్‌వో సిద్ధప్ప, ఎంఆర్‌సీ అపరేటర్ సిద్ధు, సీసీ అనసూయ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వేలం నిర్వహించాలి

లోకాయుక్త కార్యాలయం వద్ద నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 18 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ దుకాణ సముదాయాలకు నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువజన సంఘాల ఐక్యకార్యచరణ సమితి కన్వీనర్ బాలరాజు, నాయకులు గోపాల్ నాయక్, రఘునాయక్, ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్ మంగళవారం హైదరాబాద్‌లోని లోకాయుక్తకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద 17 దుకాణాలు, రాందాస్ చౌరస్తా వద్ద పటేల్‌కుంటలోని 67 దుకాణాలను నిబంధనలను బేఖాతరు చేస్తూ కేటాయించారన్నారు. ఓకే వ్యక్తికి ఓకే దుకాణం కేటాయించాలని నిబంధనలు ఉన్నా ఓకే వ్యక్తిపై పదికి పైగా దుకాణాలు కేటాయించారన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ నిబంధనల ప్రకారం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీల న్యాయం చేస్తూ దుకాణాలు కేటాయించాలని లోకాయుక్తకు విన్నవించినట్లు వారు తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న ఎంపీపీ గడ్డి స్వప్నావెంకటేశ్ యాదవ్

తూప్రాన్, జూన్ 18 : తూప్రాన్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గడ్డి స్వప్నా వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, వ్యవసాయ, విద్యుత్, పౌర సరఫరా, సాంఘిక సంక్షేమ, ఇందిరాక్రాంతి పథం, సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తూప్రాన్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శరణ్య భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూచనపల్లిలో వ్యక్తి దారుణ హత్య

హుస్నాబాద్ రూరల్, జూన్ 18 : మండలంలోని కూచనపల్లి గ్రామంలో గీకురు నర్సయ్య(55) అనే వ్యక్తిని దుండగులు సోమవారం రాత్రి గొడ్డలితో నరికి చంపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీకురు నర్సయ్య ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు సేకరించి అమ్ముతూ వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తుండగా అతడి భార్య ఎల్లవ్వ కూలీ పని చేస్తుంది. ఈ క్రమంలో నర్సయ్య రాత్రి ఇంటి వరండాలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేసి చంపారు. ఎల్లవ్వ నిద్ర లేచి చూసి చుట్టుపక్కల వారికి సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సాయంతో విచారణ చేపట్టారు. నర్సయ్యకు ఎవరితో శత్రుత్వం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉండగా వారికి వివాహమైంది. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అస్తవ్యస్తంగా పల్లె పాలన

- కొరవడిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీ కార్యదర్శులు

మెదక్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరి 1న ప్రభుత్వం జిల్లాలోనని 469 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పంచాయతీ కార్యదర్శులపైనే పనిభారం పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరుకాపోవడంతో పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం నిధులు, విధులపై స్పష్టత ఇవ్వకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గత సర్పంచ్‌లు గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలను ఖాళీగానే ఉంచారు. కనీసం విద్యుత్ బిల్లులు, బోరు మరమ్మతులు, చెత్త సేకరణకు వాడే ట్రాక్టర్లకు డీజిల్ సైతం కొనలేని పరిస్థితి దాపురించింది. అంతేకాదు గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలలు చెల్లించలేని దుస్థితి ఉంది.

కార్యదర్శులపై నిర్వహణ భారం

గతంలో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్యాంకర్లు పంచాయతీ కార్యదర్శులపై రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీంతో పంచాయతీల్లో ఉన్న నిధులను ముందస్తుగానే కిస్తులకు చెల్లించడంతో పంచాయతీ బ్యాంకు ఖాతాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో నిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. చేసేదేమీ లేక కార్యదర్శులు అప్పులు చేసి మరీ పంచాయతీల్లో పనులను చేపడుతున్నారు. అత్యవసర పనులైన తాగునీటి పైపులైన్ లీకేజీ, మురికి కాల్వల మరమ్మతులు చేయాల్సి ఉన్నది. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది.

పంచాయతీలకు నిధులు నిల్

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ప్రధాన ఆధారం. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికీ రూ.812 చొప్పున 15 ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కానీ 2022, ఆగస్టు నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. అయితే మేజర్ పంచాయతీల్లో ఇంటి, వ్యాపార పన్నులు, లైబజార్, ఇంటి నిర్మాణ ఫీజులు, వ్యాపార వాణిజ్య లైసెన్స్ ఫీజుల ద్వారా డబ్బులు జమ అవుతాయి. కానీ చిన్న గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు తప్ప ఇతర ఆర్థిక మార్గాలు ఉండవు. ఇదిలా వుండగా ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీల వైపు కన్నెత్తి చూడడం లేదు.

వానకాలం సాగుపై అవగాహన

- రామాయంపేటలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్
- పంటలపై రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న రైతులు, అధికారులు

రామాయంపేట, జూన్ 18 : వానకాలంలో పంటలు విత్తుకునేందుకు ముందే రైతులు విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. మంగళవారం రామయాంపేట రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లోని రైతులకు రామాయంపేటలో వీడియో కాన్ఫరెన్సును నిర్వహించి రైతులకు పలు సూచనలు సలహాలిచ్చారు. రైతులు తమ పంట పొలాల్లో భూసాంద్రతను బట్టి విత్తనాలను వేసుకోవాలన్నారు. తమ పంట భూమిని కచ్చితంగా భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. పంట భూమిలో ఎలాంటి పంటలు పండుతాయో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే పంటలో విత్తనాలను విత్తుకోవాలన్నారు. పంటభూమిలో భూసారాన్ని బట్టి రసాయనిక ఎరువులను చల్లాలన్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో రైతులు సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. సేంద్రియంతో మంచి పంటలు పండడమే గాకుండా చీడపీడల నివారణకు ఎంతో ఉపయోగపడ్తుందన్నారు. అందు కోసం రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలన్నారు. సేంద్రియంతో అయితే పంట దిగుబడి అదికంగా ఉండి రైతులకు లాబాలు చేకూరుస్తాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డివిజన్ వ్యవసాయ సంచాలకులు వసంత సుగుణ, మండలాల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్‌నారాయణ, సతీశ్, హరిప్రసాద్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

'రైతు నేస్తం' ద్వారా రైతులకు అవగాహన

పోతంశెట్టిపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

కొల్చారం, జూన్ 18 : రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పోతంశెట్టి పల్లి రైతు వేదికలో వర్షాకాల పంటల సాగు మెళకువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మొక్కజొన్న, వరి పంటల యజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

గుండం మల్లేశ్(ఫైల్)

నర్సాపూర్, జూన్ 18 : కరెంట్ షాక్ తగిలి ఓ యువ కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామానికి చెందిన గుండం మల్లేశ్ (38) తనకున్న 10 గుంటల భూమితో పాటు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మల్లేశ్ కౌలుకు తీసుకున్న పొలం వద్ద స్తంభం నుంచి స్టార్టర్ డబ్బాకు ఉన్న విద్యుత్ తీగను మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మల్లేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, ఎంపీటీసీ లక్ష్మీఅశోక్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్, గ్రామస్తులు కోరారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలి

ఎంపీడీవో సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, కార్మికులు

చిలిపిచెడ్, జూన్ 18 : గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు ఏడు నెలలుగా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే జీతాలు చెల్లించాలని జిల్లా సీఐటీయూ కోశాధికారి నర్సమ్మ ఎంపీడీవో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం చిలిపిచెడ్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్మికులతో నిరసన చేపట్టి ఎంపీడీవో సిబ్బంది రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృత్తం చేస్తామన్నారు. కార్మికులు ప్రభాకర్, మల్లేశం, శేఖర్,యాదయ్య, భిక్షపతి, రాములు, బాల్‌రాజు, తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

గౌతాపూర్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న యూత్ అధ్యక్షుడు శ్యామ్, ఉపాధ్యాయులు

చిలిపిచెడ్, జూన్ 18 : మండల పరిధిలోని గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిళ్లను ఆదర్శ యూత్ అధ్యక్షుడు శ్యామ్, సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వాన్ నాయక్, శ్రీనివాస్ నాయక్, స్వరూప, తేజశ్రీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు పీహెసీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

ములుగు, జూన్ 18 : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. ములుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కలుషితనీరు, దోమలవల్ల వర్షాకాలంలో సోకే అంటువ్యాధులు విజృంభిస్తాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలన్నారు. అం దుకు అవసరమైన టాస్క్‌ఫోర్స్ కమిటీలను మండల స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి అఖిల, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల ఆవరణ పచ్చదనం, పరిశుభ్రతో ఉండాలి

చేగుంట మండలం వల్లభాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న గ్రామ ప్రత్యేక అధికారి భూమేశ్, హెచ్ఎం పరమేశ్వర్‌రెడ్డి

చేగుంట, జూన్ 18 : పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పరిశుభ్రతో ఉంచాలని వల్లభాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి భూమేశ్ అన్నారు. చేగుంట మండల పరిధిలోని వల్లభాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల హెచ్ఎం మెతకు పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రత్యేక అధికారి భూమేశ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పోచమ్మల శ్యామల విద్యార్థులతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సమత, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

మెదక్ అర్బన్, జూన్ 18 : నులి పురుగుల నిర్మూల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జూన్ 20వ తేదీ నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, మదర్సాలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు మొదలగు అన్ని విద్యాసంస్థల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. జిల్లాలోని ఒకటి నుంచి 19 ఏండ్ల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. జూన్ 27న మిగిలిపోయిన పిల్లలందరికీ ఎంఓపీ-యూపీ రౌండ్ రోజున ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధురి, డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ అనిత, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీఎం మెడికల్ కళాశాల విద్యార్థుల ఆందోళన

ములుగు, జూన్ 18 : ఆర్వీఎం వైద్య కళాశాలలో కొంతమంది అధ్యాపకులు ఉద్దేశపూర్వకంగా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం నిరసనకు దిగారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం మెడికల్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పట్ల కొంతమంది అధ్యాపకులు కావాలని టార్గెట్ చేసి దవాఖానలో డ్యూటీలు వేస్తున్నారని, వసతి గృహంలో నాణ్యమైన భోజనాలు అందించడంలేదని ఆరోపిస్తూ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ములుగు ఎస్సై విజయ్‌కుమార్, వైద్య కళాశాల సీఈవో శ్రీనివాస్‌రావు విద్యార్థులతో మాట్లాడి భవిష్యత్తులో ఇలాంటి మసస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నశంకరంపేట, జూన్ 18 : చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో తెలుగు, హిందీ, గణితము బోధించడానికి అతిథి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు నేటి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాఠశాలకు రావాలని కోరారు.

పాఠశాల తనిఖీ

కొల్చారం, జూన్ 18 : మండల కేంద్రమైన కొల్చారంలోని కేజీబీవీ పాఠశాల, రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం మండల విద్యాధికారి నీలకంఠం సందర్శించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కొల్చారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

నర్సాపూర్, జూన్18 : నేడు (బుధవారం) మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్, కొల్చారం, కౌడిపల్లి మండలాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కొల్చారం మండలంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. అనంతరం కొల్చారం మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. పోతంశెట్టిపల్లి సమీపంలో నిర్మించనున్న బ్రిడ్జికి, కౌడిపల్లి మండలంలోని వెల్మకన్న, నర్సాపూర్ మండల పరిధిలోని లక్ష్మణ్ తండాలో బీటీ రోడ్డు శంకుస్థాపనతో పాటు నర్సాపూర్ సాయికృష్ణ గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నారు. సాయికృష్ణ గార్డెన్‌లో కల్యాణ లక్ష్మి, చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కమలాద్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

రామాయంపేట, జూన్ 18 : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలైన సంఘటన రామాయంపేట జాతీయ రహదారి డబుల్‌బెడ్ రూమ్ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. రామాయంపేట పట్టణ శివారు కేసీఆర్ కాలనీకి చెందిన భార్యాభర్తలు తమ వాహనంపై కామారెడ్డి నుంచి రామాయంపేటలోని తమ స్వగృహం డబుల్ బెడ్‌రూమ్‌కు వస్తున్నారు. ఎదురుగా హైదరాబాద్ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ కాసుల లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు 108 లో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్సలు నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉందనంతో మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దశంకరంపేట, జూన్18 : పెద్దశంకరంపేట మండలపరిధిలోని భూర్గుపల్లి, రామోజిపల్లి, 33 కేవీ సబ్‌స్టేషన్ కేంద్రాల్లో నిర్వహణ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈ పీడర్ల పరిధిలోని కొత్తపేట, వీరోజిపల్లి, సంగారెడ్డి, జూకల్, మూసాపేట, దానంపల్లి, శివాయపల్లి, మాడ్చెట్‌పల్లి, గ్రామాలతో పాటు పరిసర గ్రామాలకు, తండాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

WANTED

★Skills Required: Languages: English, Hindi, Ms Office, Word, Excel. Qualification: Graduation. Work Location: Sangareddy, Salary : 15,000/-. If interested, WhatsApp On: 7042239999, 9502187777
NT-328231

CHANGE OF NAME

★I, JYOTHIBAI KOLANU, D/o. Satyanarayana, R/o. H.No. 5-98/168, Block A, Lane-2, Siddarth Enclave, Patelguda, Sangareddy District, Telangana State-502 319, have been Changed /Corrected My Name from JYOTHIBAI KOLANU to JYOTHI GUNDETI, W/o. Udaya Kumar Gundeti for all My Records.
NT-2350

★I, UDAY KUMAR, S/o. Ravinder Kumar, R/o. H.No. 5-98/168, Block A, Lane-2, Siddarth Enclave, Patelguda, Sangareddy District, Telangana State-502 319, have been Corrected/Changed My Name from UDAY KUMAR to UDAYA KUMAR GUNDETI, S/o. Ravinder Kumar for all My Records purposes.
NT-2351

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.